గురువారం 08-08-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1 సంచిక: 418 పేజీలు: | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



రోడ్లు లేకున్నా పోలాల్లో బ్రిడ్జి నిర్మాణం

మిగతా 3లో



వర్షా ల్లో నష్టపోయే ఆస్తికి ఇన్సూరెన్స్ ఉంటుందా..

మిగతా 4లో



కల్తీపాల వ్యాపారం ఈ 3 రాష్ట్రాల్లోనే ఎక్కువ

మిగతా 2లో



నా వల్లనే ఫ్లాప్ అంటున్నారు


మిగతా 5లో

## వినేశ్..

# నువ్వు ఛాంపియన్లకే ఛాంపియన్!

### వినేశ్‌ను ఓదార్చిన భారత ప్రధాని మోడీ

### పీటీ ఉషతో ఫోన్‌లో ప్రధాని మోడీ



ముందడుగు జాతీయం

భారత ప్రధాని మోడీ స్పందిస్తూ వినేశ్‌ను ఓదార్చారు. "వినేశ్.. నువ్వు ఛాంపియన్లకే ఛాంపియన్! నీ ప్రతిభ దేశానికి గర్వకారణం. భారతీయులందరికీ నువ్వు స్ఫూర్తిదాయకం. ఈ రోజు నీకు తగిలిన ఎదురుదెబ్బ ఎంతో బాధించింది. దీన్ని వ్యక్తం చేయడానికి నా దగ్గర మాటల్లేవు. కానీ, ఈ బాధ నుంచి బయటపడి నువ్వు బలంగా తిరిగి రాగలవని నేను నమ్ముతున్నా. సవాళ్లను ఎదిరించడం నీ నైజం. నీకు మేమంతా అండగా ఉన్నాం" అని మోదీ భరోసానిచ్చారు.

### పీటీ ఉషకు మోడీ ఫోన్..

తాజా పరిణామాల వేళ భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో ప్రధాని మోడీ ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. వినేశ్‌పై అనర్హతకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీసిన ప్రధాని.. దీన్ని సవాల్ చేసేందుకు భారత్‌కు ఉన్న అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. వినేశ్‌కు ఉపయోగపడుతుందనుకుంటే అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ వద్ద భారత్ నిరసనను బలంగా వ్యక్తపర్చాలని పీటీ ఉషకు సూచించినట్లు సమాచారం. ఒలింపిక్స్ మహిళల 50 కేజీల విభాగంలో వినేశ్ ఫైనల్‌కు చేరిన సంగతి తెలిసిందే. బుధవారం రాత్రి ఈ మ్యాచ్ జరగాల్సిఉండగా.. ఈ ఉదయం పోటీదారుల బరువును పరీక్షించారు. ఇందులో ఆమె కొన్ని గ్రాముల అదనపు బరువు ఉండటంతో అనర్హత వేటు పడింది. దీంతో పతకం చేజారింది.



# బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వానికి సిద్ధం

### గురువారం సాయంత్రం ప్రమాణస్వీకారం

### ఆర్మీ చీఫ్ జనరల్ వకార్ ఉజ్ జమాన్ వెల్లడి



ముందడుగు బంగ్లాదేశ్

బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమైంది. నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం కొలువుదీరనున్నట్లు ఆర్మీ చీఫ్ జనరల్ వకార్ ఉజ్ జమాన్ వెల్లడించారు. గురువారం సాయంత్రం 8 గంటలకు యూనస్ ప్రమాణస్వీకారం ఉంటుందన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి విలేకరులతో మాట్లాడిన ఆర్మీ చీఫ్ జనరల్ వకార్ ఉజ్ జమాన్.. 15 మందితో ప్రభుత్వ సలహా మండలి ఏర్పాటు కానుందని చెప్పారు. పార్లమెంటును రద్దు చేసి, యూనస్ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఉద్యమకారులు చేసిన డిమాండ్ నేపథ్యంలోనే ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి.

నోబెల్ శాంతి పురస్కార గ్రహీత మహమ్మద్ యూనస్ 2012 నుంచి 2018 వరకు స్కాట్లాండ్‌లోని గ్లాస్గో కాలెడోనియన్ విశ్వవిద్యాలయానికి కులపతి (ఛాన్సలర్)గా ఉన్నారు. చిట్టగాంగ్ విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్ర ఆచార్యునిగా సేవలందించి, బంగ్లాదేశ్‌లోని పేదల అభ్యున్నతి కోసం కృషిచేశారు. చిట్టగాంగ్‌లో 1940లో జన్మించిన ఆయన ఓ సామాజిక కార్యకర్త, బ్యాంకర్, ఆర్థిక వేత్త. మైక్రోఫైనాన్స్ బ్యాంక్ ద్వారా లక్షల మంది ప్రజలను పేదరికం నుంచి విముక్తి కలిగించిన ఘనతను సాధించారు. అందుకు 2006లో నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులూ ఆయన్ను వరించాయి.



# వయనాడ్ జాతీయ విపత్తుగా ప్రకటించాలి

### లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

ముందడుగు ఢిల్లీ

లోక్‌సభలో జీరో అవర్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వయనాడ్ విపత్తు అంశాన్ని ప్రస్తావించారు. వయనాడ్‌లో బాధితులను ఆదుకునేందుకు వివిధ వర్గాలు ముందుకురావడం హర్షణీయమన్నారు. ఇటీవల తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వనయాడ్‌లో పర్యటించామమన్నారు.

మిగతా 2లో

ముందడుగు
గురువారం, 08-08-2024, హైదరాబాద్



## న్యాయమూర్తులు సంయమనం పాటించాలి

- సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించడం రాజ్యాంగబద్ధం
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్

ముందడుగు జాతీయం

సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశాలను పాటించడం ఐచ్ఛికం కాదని.. రాజ్యాంగబద్ధంగా తప్పనిసరని పేర్కొంది. వాటిపై ఏమైనా వ్యాఖ్యలు చేసేటప్పుడు న్యాయమూర్తులు సంయమనం పాటించాలని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా పంజాబ్-హరియాణా హైకోర్టు న్యాయమూర్తి తీరును గర్హించింది. "కోర్టు తీర్పు పట్ల ఓ వర్గం అసంతృప్తికి గురికావచ్చు. కానీ, ఉన్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలపై న్యాయమూర్తులు ఎప్పుడూ అసంతృప్తి వ్యక్తం చేయలేరు" అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. విమర్శలు చేయడం అనవసరమని, అటువంటివి న్యాయస్థానాల గౌరవాన్ని తగ్గిస్తాయని అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులపై వ్యాఖ్యలు చేసేటప్పుడు సంయమనం పాటిస్తూ జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఓ భూ వివాదం కేసుకు సంబంధించిన కిందకోర్టు ఇచ్చిన తీర్పుపై మే 3న సుప్రీం కోర్టు స్టే విధించింది. దీనిపై పంజాబ్-హరియాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజ్‌బిర్ షెరావత్ బహిరంగ విమర్శలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించిన భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం.. ఈ పరిణామాన్ని తీవ్ర ఆందోళన అంశంగా అభివర్ణించింది. న్యాయమూర్తి వ్యాఖ్యలు ధిక్కార కేసు కిందకే వస్తాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా పేర్కొన్నారు. అయితే, ధిక్కారం కింద న్యాయమూర్తిపై చర్యలు తీసుకునేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది.

## కల్తీపాల వ్యాపారం ఈ 3 రాష్ట్రాల్లోనే ఎక్కువ

### పార్లమెంట్‌లో ప్రశ్నకు కేంద్రం సమాధానం

ముందడుగు జాతీయం



గత మూడేళ్లలో ఉత్తరప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో కల్తీ పాల విక్రయాలపై అత్యధిక కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ఇంకా దేశంలో కల్తీ పాల వ్యాపారం కొనసాగుతూనే ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వశాఖ పార్లమెంట్‌లో ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పింది. గడిచిన మూడేళ్లలో యూపీ, కేరళ, తమిళనాడులో ఎక్కువగా కల్తీ పాల విక్రయం కేసులు నమోదైనట్లు పేర్కొంది. 2023-24లో యూపీలో 16వేలకుపైగా నమూనాలను పరిశీలించగా నమూనాలు పాజిటివ్‌గా వచ్చాయి. ఆయా నమూనాలు ప్రమాణాలకు అనుగుణంగా లేవు. తమిళనాడులో 2,200పైగా కేసులు నమోదయ్యాయి. ఇక కేరళలో 1,300 కేసులు రికార్డయ్యాయి. 2022-23, 2021-22 సంవత్సరాల్లోనూ ఈ మూడు రాష్ట్రాల్లోనే అత్యధికంగా కల్తీ పాల కేసులు నమోదయ్యాయి. వీటితో పాటు బిహార్, హర్యానా, మహారాష్ట్ర, రాజస్థాన్, పంజాబ్, మధ్యప్రదేశ్‌లోనూ కల్తీ పాలకు సంబంధించిన కేసులు నమోదవుతున్నాయి. దేశంలోని ఐదు రాష్ట్రాలు మాత్రమే 52 శాతం పాలను ఉత్పత్తి చేస్తున్నాయి. నాబార్డ్ డేటా ప్రకారం.. ఆ రాష్ట్రాల జాబితాలో రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. పాల ఉత్పత్తిలో రాజస్థాన్ దేశంలోని ముందువరుసలో ఉన్నది. ఇక్కడ పశుపోషణ ఎక్కువగా ఉండడంతో పాల ఉత్పత్తి సైతం ఎక్కువగా జరుగుతున్నది. 2023 సంవత్సరానికి సంబంధించిన నాబార్డ్ డేటా ప్రకారం.. దేశంలో ఉత్పత్తి అయ్యే మొత్తం పాలలో 15.05శాతం రాజస్థాన్ ఉత్పత్తి చేస్తుంది. ఈ జాబితాలో ఉత్తరప్రదేశ్ రెండో స్థానంలో ఉన్నది. యూపీలో 14.93 శాతం పాల ఉత్పత్తి జరుగుతున్నది. 8.06 శాతం పాల ఉత్పత్తిలో మధ్యప్రదేశ్ మూడో స్థానంలో ఉంది. ఆ తర్వాత గుజరాత్, ఏపీ నాలుగు, ఐదో స్థానాల్లో నిలిచాయి.

## బంగ్లాదేశ్‌లో హిందువులను టార్గెట్ చేస్తున్నారు

### ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆరోపణ

ముందడుగు ఉత్తరప్రదేశ్



బంగ్లాదేశ్‌లో హిందువులను టార్గెట్ చేస్తున్నారని ఉత్తర్ ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ బుధవారం ఆరోపించారు. సనాతన ధర్మానికి ఎదురయ్యే బెదిరింపులను ఎదుర్కోవడానికి ఐక్యత అవసరమని ఆయన బుధవారం అన్నారు. అయోధ్య పర్యటనలో ఆయన మాట్లాడుతూ.. అయోధ్య నిర్మాణం పెద్ద ప్రయాణంలో ప్రధాన మైలురాయి అని అన్నారు. గతంలో జరిగిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుని సనాతన ధర్మ పరిరక్షణకు ఉమ్మడిగా కృషి చేయాలని ఆయన కోరారు. 500 ఏళ్ల పోరాటం తర్వాత రామ మందిర నిర్మాణం పూర్తైందని, ఇది ఒక పెద్ద సామాజిక లక్ష్యం దిశగా ఒక మైలురాయి అని ఆయన వ్యాఖ్యానించారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర మొదటి అధ్యక్షుడు, స్వర్గీయ బ్రహ్మలిన్ పరమహంస రాంచరణ్ దాస్ 21వ వర్ధంతి సందర్భంగా యోగి ఆదిత్యనాత్ నివాళులు అర్పించారు. ఆయన గౌరవార్థం అయోధ్యంలో విగ్రహాన్ని ఆశిష్కరించారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర అధినేత నృత్య గోపాల్ దాస్ మహరాజ్‌ని సీఎం యోగి కలిశారు. ఈ కార్యక్రమంలో యూపీ మంత్రి మహంత్ సురేష్ దాస్, సూర్యప్రతాప్ షాహీతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## స్నేహితురాలి ఫోన్ కోసం తల్లి బంగారం దొంగతనం

### 9వ తరగతి బాలుడి ఘనకార్యం

ముందడుగు ఢిల్లీ



9వ తరగతి చదువుతున్న బాలుడు స్నేహితురాలి పుట్టిన రోజు సందర్భంగా ఐఫోన్ గిఫ్ట్‌గా ఇచ్చేందుకు ఏకంగా తల్లి బంగారాన్ని దొంగిలించాడు. స్వర్ణకారులకు విక్రయించిన డబ్బుతో ఐఫోన్ కొన్నాడు. తల్లి ఫిర్యాదుతో దర్యాప్తు జరిపిన పోలీసులు చివరకు నిందితుడైన ఆ బాలుడిని అరెస్ట్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. నజాఫ్‌గఢ్ ప్రాంతంలో తల్లితో కలిసి నివసిస్తున్న బాలుడు ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. క్లాస్‌మేట్ అయిన స్నేహితురాలి పుట్టిన రోజున సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇవ్వాలని భావించాడు. దీని కోసం తల్లిని డబ్బు అడిగాడు. నిరాకరించిన ఆమె చదువుపై దృష్టిపెట్టాలని కొడుకును మందలించింది. ఆగస్ట్ 2న ఆ మహిళ ఇంట్లో చోరీ జరిగింది. ఆమెకు చెందిన రెండు బంగారు గొలుసులు, ఒక జత బంగారు చెవిపోగులు, ఒక బంగారు ఉంగరం మాయమయ్యాయి. ఆ మరునాడు పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించిన తర్వాత బయట నుంచి ఎవరూ చోరీకి పాల్పడలేదని గ్రహించారు. తండ్రి మరణించడంతో తల్లితోపాటు ఉంటున్న కుమారుడిపై అనుమానం వ్యక్తం చేశారు. ఆ బాలుడిని ప్రశ్నించగా తల్లి బంగారాన్ని తానే చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. ఇద్దరు స్వర్ణకారులకు విక్రయించినట్లు తెలిపాడు. రూ.50,000 ఖరీదైన ఐఫోన్ కొని పుట్టిన రోజున స్నేహితురాలికి గిఫ్ట్‌గా ఇచ్చినట్లు చెప్పాడు.

## వయనాడ్ జాతీయ విపత్తుగా ప్రకటించాలి

(మొదటిపేజీ తరువాయి)

భయంకరమైన విధ్వంసాన్ని, జనాల బాధలను కళ్లారా చూశానన్నారు. కొండచరియలు విరిగిపడి రెండుకిలోమీటర్ల వరకు రాళ్ల కుప్పలు ఉన్నాయన్నారు. విపత్తులో 300 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని.. పెద్ద సంఖ్యలో జనం గల్లంతయ్యారన్నారు. సంఘటనా స్థలంలో సేవలందిస్తున్న రెస్క్యూ సిబ్బందిని అభినందించారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు అందిస్తున్న సహాయాన్ని సహాయన్ని సైతం ప్రశంసించారు. కొండచరియలు విరిగిపడడంతో ప్రధాన రహదారి తెగిపోయిందని.. దాంతో ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడంలో రెస్క్యూ బృందాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయన్నారు. అయితే ఈ విపత్తులో చాలా సందర్భాలలో కుటుంబంలోని ఒక సభ్యుడు మాత్రమే ప్రాణాలతో బయటపడడం చాలా బాధాకరమన్నారు. వాయనాడ్ ప్రజల సమస్యను లేవనెత్తినందుకు సభకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50వేల ఎక్స్‌గ్రేషియాను ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన విషయం తెలిసిందే.

ముందడుగు
గురువారం,
08-08-2024,
హైదరాబాద్



# రోడ్లు లేకున్నా పోలాల్లో బ్రిడ్జి నిర్మాణం

## రూ. 3 కోట్లు రూపాయలు ఖర్చు చేసిన అధికారులు

ముందడుగు బీహార్

బీహార్ రాష్ట్రంలో ఓ బ్రిడ్జి నిర్మాణం వైరల్‌గా మారింది. పూర్తిగా మైదాన ప్రాంతంలో ఓ బ్రిడ్జ్ నిర్మించిన ఫోటో వైరల్ అయింది. ఈ బ్రిడ్జ్‌కి రోడ్డు లేకపోవడం, పొలాల్లో ఉండటం చూసి అంతా షాక్ అవుతున్నారు. ఇరు వైపులా రోడ్డు లేకుండా రూ. 3 కోట్ల వ్యయంతో నిర్మించారు. ముఖ్యమంత్రి గ్రామీణ సడక్ పథకం కింద అరారియా జిల్లాలో ఈ వంతెన నిర్మాణం జరిగింది. పర్మానందర్‌పూర్ గ్రామంలో 3 కి.మీ పొడవైన రహదారి, వంతెన ప్రాజెక్టులో భాగంగా ఈ బ్రిడ్జ్ నిర్మాణం జరిగింది. ఈ ప్రాంతంలో నది ఉందని, వర్షా కాలంలో సమస్యగా మారుతోందని, మిగిలిన ఏడాది ఇది ఎండిపోయి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. వర్షా కాలంలో గ్రామాలను కలుపేందుకు రోడ్డు, వంతెన నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం బ్రిడ్జ్ నిర్మితమైన ప్రాంతాన్ని ప్రభుత్వం సేకరించింది. అయితే, మిగిలిన ప్రాంతాన్ని అధికారులు ఇంకా సేకరించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో సేకరించిన భూమిలో ప్రభుత్వం అప్రోచ్ మార్గం లేకుండానే వంతెన నిర్మించింది. దీనిపై అరారియా జిల్లా కలెక్టర్ ఇనాయత్ ఖాన్ స్పందించారు. " ఈ విషయం నా దృష్టికి వచ్చింది. దీనికి సంబంధించి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నుంచి నివేదిక కోరాను. దీంతో పాటు సబ్ డివిజనల్ అధికారి, సర్కిల్ ఆఫీసర్, సంబంధిత ఇంజనీర్ సైట్‌ని సందర్శించాలని కోరాను. భూములు అందుబాటులో లేని సందర్భంతో ఈ ప్లాన్ ఎలా రూపొందించారనే విషయాన్ని పరిశీలిస్తున్నాము. అవసరమైన చర్యలు తీసుకుంటాము'' అని కలెక్టర్ చెప్పారు.

# అంతకు ముందే బీమా ప్రీమియంలపై పన్ను

ముందడుగు జాతీయం

దేశంలో జీవిత, ఆరోగ్య బీమా పాలసీ ప్రీమియంలపై జీఎస్టీని రద్దు చేయాలంటూ డిమాండ్లు ఊపందుకున్న వేళ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. ఈ అంశంపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆమెకు తొలుత లేఖ రాయగా.. తాజాగా ఇండియా కూటమి సభ్యులు లోక్‌సభ వేదికగా జీఎస్టీ తొలగించాలంటూ డిమాండ్ చేశారు. ఈ క్రమంలో లోక్‌సభలో ఆమె మాట్లాడారు. జీఎస్టీ విధానం అమల్లోకి రాకముందు కూడా బీమా ప్రీమియంలపై పన్ను వసూలు అయ్యేదని నిర్మలా సీతారామన్ గుర్తు చేశారు. ఇదేమీ కొత్త విషయం కాదని, అన్ని రాష్ట్రాల్లో ఇది అమలైందని పేర్కొన్నారు. జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చాకా అదే విధానం కొనసాగిందన్నారు. ఇలా వసూలైన జీఎస్టీలో 75 శాతం రాష్ట్రాలకే వెళుతోందని పేర్కొన్నారు. ఇక్కడ ఆందోళన చేస్తున్న వారు ఎప్పుడైనా తమ రాష్ట్రాల్లో దీనిపై చర్చించారా? అని ప్రశ్నించారు. ఒకరు లేవనెత్తిన అంశంపై (గడ్కరీనుద్దేశించి).. ఏకంగా 200 మంది ఎంపీలు పార్లమెంట్ వేదికగా అదే పల్లవి అందుకున్నారని ఎద్దేవా చేశారు.

# యాదాద్రి హుండీ ఆదాయం రూ. 2.66కోట్లు

## నెల రోజులుగా భక్తులు సమర్పించిన కానుకలు

ముందడుగు యాదాద్రి



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి భక్తుల నుంచి భారీగా ఆదాయం లభించింది. స్వామివారికి నెల రోజులుగా భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించగా రూ.రెండున్నర కోట్లకు పైగా నగదు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కొండకింద శ్రీసత్య నారాయణస్వామి వ్రత మండపంలో చేపట్టిన ఈ లెక్కింపులో స్వామివారికి నగదు రూపంలో రూ.2,66,68,787, మిశ్రమ బంగారం 87 గ్రాములు, వెండి 3,300 గ్రాములు చొప్పన వచ్చినట్లు ఈవో భాస్కరరావు వెల్లడించారు. లెక్కింపులో ఈవోతో పాటు ఆలయ ధర్మకర్త నరసింహ మూర్తి, ఆలయ సిబ్బందితో పాటు సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు. లక్ష్మీనరసింహస్వామి వారికి భారీగా విదేశీ కరెన్సీ కూడా వచ్చింది.



## మీరు మనుషులేనా..

# మానవత్వం లేదా..

### వయనాడ్ బాధితులను పీడిస్తున్న ఫైనాన్స్ కంపెనీలు
### బలవంత రుణాలపై కేరళ ప్రభుత్వం ఆగ్రహం

ముందడుగు కేరళ

వయనాడ్ బాధితులను అమానవీయంగా ఇబ్బంది పెట్టినా, బలవంతంగా రుణాలు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని కేరళ ప్రభుత్వం హెచ్చరించింది. ల్యాండ్ స్లైడ్ బాధిత రిలీఫ్ క్యాంపుల్లో ఉన్న వారిపై ప్రైవేట్ ఫైనాన్సర్లు రుణాలుచెల్లించాలని వత్తిడి తేవడం పై కేరళ ప్రభుత్వం దృష్టికి రావడంతో సీరియస్ గా తీసుకుంది. బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించినట్లు పబ్లిక్ వర్క్స్ శాఖ మంత్రి పీఎ మహమ్మద్ రియాజ్ సోషల్ మీడియాలో తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో ఇటువంటి చర్యలు సరియైంది కాదని .. బాధితులపై ఒత్తిడి తెస్తే.. కఠిన చర్యలు తప్పవని అన్నారు. సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వ చర్యలు తీసుకుంటుందన్నారు. వయనాడ్ లో జూలై 30న, 2024న కొండచరియలు విరిగిపడి ప్రాణాలతో బయటపడిన వారికి కొన్నిఫైనాన్స్ కంపెనీలు ఫోన్ చేసి తాము తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించాలని వత్తిడి తెస్తున్నారని ప్రభుత్వం దృష్టికి రావడంతో ఫైనాన్సర్ ఆగడాలకు చెక్ పెట్టేందుకు కేరళ ప్రభుత్వం కఠిన చర్యలు తప్పవని తెలిపింది.

## రియల్ ఎస్టేట్ మోసంతో

# తనకేం సంబంధం లేదు

### సోషల్ మీడియా వేదికగా స్పందించిన సుమ



ముందడుగు హైదరాబాద్

ఆంధ్ర ప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం కేంద్రంగా సాగుతున్న ఓ రియల్ ఎస్టేట్ సంస్థ తాజాగా బోర్డు తిప్పేసిందని వార్తలొచ్చాయి. ఆమె యాడ్ చూసే ఫ్లాట్స్ కొన్నామంటూ బాధితులు ఆరోపించినట్టు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఈ మేరకు కొందరు బాధితులు ఆమెకు లీగల్ నోటీసులు పంపారని సమాచారం. ఈ పరిణామంపై సుమ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. కంపెనీ మోసంతో తనకెలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ''రియల్ ఎస్టేట్ సంస్థకు సంబంధించి గతంలో నేను చేసిన యాడ్ సోషల్ మీడియాలో ఇప్పుడు కనిపిస్తోంది. సదరు యాడ్‌ను 2016 నుంచి 2018 వరకే టెలికాస్ట్ చేసేలా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నాం. కానీ, మా అనుమతి లేకుండా ఇంకా ఆ యాడ్‌ను ప్రదర్శించారు. కొందరు బాధితులు నాకు లీగల్ నోటీసులు పంపారు. వారికి సమాధానమిచ్చా. ఆ సంస్థకూ నోటీసులు పంపా. అధికారిక ఛానల్స్‌లో వచ్చే యాడ్స్, ప్రమోషన్స్‌లోనే కచ్చితమైన సమాచారం ఉంటుందనే విషయాన్నిగ్రహించాలి. వెరిఫైడ్ ఇన్ఫర్మేషన్ మాత్రమే షేర్ చేయాలి'' అని విజ్ఞప్తి చేశారు.

ముందడుగు
గురువారం, 08-08-2024, హైదరాబాద్





# వర్షాల్లో నష్టపోయే ఆస్తికి ఇన్సూరెన్స్ ఉంటుందా..

## హోమ్ ఇన్సూరెన్స్ ఎవరు తీసుకోవచ్చు..? .. ఇన్సూరెన్స్ పరిధిలోకి వచ్చే వస్తువులు ఇవే..

ముందడుగు ప్రత్యేకం...

వర్షా కాలంలో కురిసే కుండపోత వర్షా లకు వరదలు రావచ్చు. ఫలితంగా ఇళ్లు దెబ్బతింటాయి. కొన్నిసార్లు సమీపంలోని కొండచరియలు విరిగిపడతాయి. పిడుగులు కూడా పడే అవకాశం ఉంది. ఇలాంటి సందర్భాల్లో అత్యంత విలువైన ఇల్లు నామరూపాల్లేకుండా ధ్వంసం అవుతుంది. ఇలాంటి భారీ నష్టం నుంచి బయట పడాలంటే హోమ్ ఇన్సూరెన్స్ తీసుకోవాల్సిన అవసరం ఉంది. హౌస్ ప్రాపర్టీ నష్టాల నుంచి రక్షించే ఈ హోమ్ ఇన్సూరెన్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం. సొంత ప్రాపర్టీ అయిన బంగ్లా, ఇల్లు లేదా రెంటెడ్ ఫ్లాట్, చిన్న అపార్ట్‌మెంట్ వంటి ఇళ్లే అన్నింటికీ ఇన్సూరెన్స్ చేయించుకోవచ్చు. అంటే ఈ ఇల్లు ఏదైనా ప్రమాదానికి గురైతే, ఆ నష్టాన్ని ఇన్సూరెన్స్ కంపెనీ భరిస్తుంది. నిజానికి మనం కట్టుకున్న గుడిసెలకు కూడా కవరేజీ పొందవచ్చు.

### ఎవరు హోమ్ ఇన్సూరెన్స్ తీసుకోవచ్చు?

సొంతిళ్లు ఉన్నవారు, ఇల్లు అద్దెకు ఇచ్చేవారు లేదా అద్దెకు తీసుకున్నవారు ఎవరైనా సరే, తమ ఇంటికి ఇన్సూరెన్స్ చేయించుకోవచ్చు. ఆ ఇల్లు మన పేరు మీద ఉన్నా, లేదా ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నా, రెండు సందర్భాల్లోనూ ఇన్సూరెన్స్ పొందవచ్చు. ఒక రెంట్ ఇంట్లో ఉన్న ఫర్నిచర్, విలువైన సామగ్రికి కూడా కవరేజ్ లభిస్తుంది. రెంట్ తీసుకున్న ఇంటికి ప్రమాదవశాత్తు ఏదైనా డ్యామేజ్ అయినా కూడా ఇన్సూరెన్స్ భరిస్తుంది. అదే విధంగా, ఇల్లు కొని అందులో ఏదైనా వ్యాపారం చేస్తుంటే, ఆ ఇంటికి హోమ్ ఇన్సూరెన్స్ కాకుండా, వ్యాపారానికి సంబంధించిన వేరొక ఇన్సూరెన్స్ తీసుకోవాలి. హోమ్ ఇన్సూరెన్స్ అంటే కేవలం ప్రజలు నివసించే ఇళ్లకే వర్తిస్తుందని గుర్తుంచుకోవాలి.

### హోమ్ ఇన్సూరెన్స్ పరిధిలోకి వచ్చేవి ఇవే!

**ఇంటి నిర్మాణం**

ఇంటి గోడలు, పైకప్పు, ఇంటి చుట్టూ ఉన్న గోడలు, కారు గ్యారేజ్ స్పేస్, సోలార్ ప్యానెల్స్, నీళ్ల ట్యాంకులు, ఇంటి లోపలి ఫ్లోర్స్ ఇవన్నీ ఇంటి నిర్మాణంలో భాగం. ఇలాంటి నిర్మాణాలకు నష్టం వాటిల్లితే ఇన్సూరెన్స్ కవరేజీ లభిస్తుంది.

**ఇంటి సామాన్లు**

టీవీ, రిఫ్రిజిరేటర్, బట్టలు, బెడ్స్, ఇతర సామాన్లు ఇవన్నీ ఇంటి సామాన్ల కిందకు వస్తాయి. వీటికి నష్టం వాటిల్లితే కంపెనీ డబ్బులు ఇస్తుంది. అలాగే, బంగారం, చిత్రాలు, వెండి సామాన్లు లాంటి విలువైన వస్తువులకు కూడా అదనపు డబ్బులు చెల్లించి ఇన్సూరెన్స్ పొందవచ్చు.

**ఇంటి అద్దె**

ఇన్సూరెన్స్ చేసిన ఇల్లు ప్రకృతి వైపరీత్యాల వల్ల డ్యామేజ్ అయితే, నివసించడానికి పనికిరాకుంటే, వేరే ఇల్లు అద్దెకు తీసుకుంటాం. ఆ అద్దె ఖర్చులను కూడా ఇన్సూరెన్స్ కంపెనీ భరిస్తుంది. ఇది కూడా ఒక యాడ్-ఆన్ ఫెసిలిటీ అని గమనించాలి.

**ప్రమాదవశాత్తు మరణం**

ఇది యాడ్-ఆన్ లేదా ఒక ఆప్షనల్ కవరేజీ. ఇంటికి జరిగిన ప్రమాదంలో ఇంటి యజమాని లేదా వారి పార్ట్‌నర్ చనిపోతే, అప్పుడు రూ.5 లక్షల వరకు డబ్బు ఇస్తారు.

# రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన దాల్మియా భారత్ ఫౌండేషన్..

## కడప జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ..




ముందడుగు కడప

సామాజిక భద్రతను పెంపొందించడంతో పాటు దీని పైన అవగాహణ కల్పించడం కోసం కడప వేదికగా దాల్మియా భారత్ లిమిటెడ్ (డీబీఎఫ్) ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన ర్యాలీని నిర్వహించారు. దాల్మియా భారత్ లిమిటెడ్‌కు చెందిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా నిర్వహించిన ఈ ర్యాలీ కలెక్టరేట్ నుంచి కోటిరెడ్డి సర్కిల్ వరకు 2 కిలోమీటర్ల మేర జరిగింది. ఈ ర్యాలీలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించమే కాకుండా ప్రమాదంలో రక్షణనిచ్చే 200 క్రాష్ హెల్మెట్‌లను స్థానికంగా డ్రైవింగ్ లైసెన్సులు కలిగిన వ్యక్తులకు పంపిణీ చేశారు. కడప ప్లాంట్‌లోని సీఎస్ఆర్ బృందం 100 హెల్మెట్‌లను కడప జిల్లా కలెక్టర్‌కు అందించగా, మిగిలిన హెల్మెట్‌లను పొరుగు గ్రామాలలోని అర్హులైన వారికి పంపిణీ చేశారు. ఈ అవగాహన ర్యాలీ గురించి కడప యూనిట్ హెడ్ ముఖేష్ కుమార్ సిన్హా మాట్లాడుతూ.., సామాజిక భాద్యతగా నిర్వహించిన తమ ప్రయత్నం సమాజ భద్రత, బాధ్యతాయుతమైన పౌరుల పట్ల కొనసాగుతున్న వారి అంకితభావాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు.

ముందడుగు
గురువారం, 08-08-2024, హైదరాబాద్



# డబ్బింగ్ పనులు మొదలు

గేమ్‌చేంజర్ రిలీజ్‌పై అప్‌డేట్ వచ్చేసింది. తాజాగా చిత్ర నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్. ఈ ఏడాది క్రిస్మస్‌కి గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం అని చెప్పడంతోపాటు ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ ఇస్తూ అభిమానుల్ని ఖుషీ చేస్తున్నారు. ఇయర్ ఎండింగ్‌లో క్రిస్మస్ సెలబ్రేషన్స్, న్యూ ఇయర్ సెలబ్రేషన్స్.. అన్నీ మావే అనే కాన్ఫిడెన్స్ నిర్మాతల్లో కనిపిస్తున్నది. ఎట్టకేలకు 'గేమ్‌చేంజర్' రిలీజ్‌పై ఓ అప్‌డేట్ ఇచ్చేశారు చిత్ర నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్. ఈ ఏడాది క్రిస్మస్‌కి గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం అని చెప్పడంతోపాటు ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ ఇస్తూ అభిమానుల్ని ఖుషీ చేస్తున్నారు. ఇయర్ ఎండింగ్‌లో క్రిస్మస్ సెలబ్రేషన్స్, న్యూ ఇయర్ సెలబ్రేషన్స్.. అన్నీ మావే అనే కాన్ఫిడెన్స్ నిర్మాతల్లో కనిపిస్తున్నది. లార్జర్ దేన్ లైఫ్ సినిమాలను తెరకెక్కించడంలో సిద్ధహస్తుడైన శంకర్.. ఇప్పటివరకూ తీసిన సినిమాలను మించేలా 'గేమ్‌చేంజర్'ని రూపొందిస్తున్నారని చిత్రయూనిట్ చెబుతున్నది. హీరో రామ్‌చరణ్ ఇప్పటికే తన పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తి చేసుకున్నారు. మిగతా షూటింగ్‌ని పూర్తి చేసే పనిలో శంకర్ బిజీగా ఉన్నారు. తాజాగా ఈ సినిమా డబ్బింగ్ పనులు షూరూ అయ్యాయి. పూజా కార్యక్రమంతో చిత్రబృందం డబ్బింగ్ కార్యక్రమాలను మొదలుపెట్టారు. 'ఆల్ సెల్ ఫర్ ద మెగా ఫైర్ వర్క్స్ – క్రిస్మస్ 2024' అంటూ డబ్బింగ్ ప్రారంభించిన విషయాన్ని సోషల్‌మీడియా ద్వారా మేకర్స్ ప్రకటించారు. అంజలి, కియారా అద్వానీ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీకాంత్, సముద్రఖని, ఎస్.జె.సూర్య, సునీల్, నవీన్‌చంద్ర ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ఎస్. తిరుణావక్కరుసు, స్టోరీ లైన్: కార్తీక్ సుబ్బరాజు, మాటలు: సాయిమాధవ్ బుర్రా, సంగీతం: తమన్.

రవితేజ మిస్టర్ బచ్చన్


## ట్రైలర్ విడుదల

హీరో రవితేజ, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబోలో వస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్' 'నామ్ తో సునా హోగా' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాను ఇండిపెండెన్స్ కానుకగా ఆగష్టు 15న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదలకు ఇంకా 08 రోజులే ఉండడంతో ప్రమోషన్స్ వేగం పెంచింది చిత్రయూనిట్. ఇందులో భాగంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ చిత్రంలో రవితేజ ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నాడు. మిరపకాయ్ సినిమా తర్వాత రవితేజ, హరీశ్ శంకర్ కాంబోలో ఈ సినిమా వస్తుండడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి.




## నా వల్లనే ఫ్లాప్ అంటున్నారు

శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా తెరకెక్కిన చిత్రం భారతీయుడు 2. లైకా ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం జూలై 12న ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. 28 ఏండ్ల తర్వాత ఈ సినిమాకు సీక్వెల్ రావడంతో మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ఈ మూవీకి ఫస్ట్ షో నుంచే మిక్స్‌డ్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా విషయంలో నేను చాలా ట్రోల్ అయ్యాయని తెలిపింది. తమిళ నటి ప్రియ భవానీ శంకర్. ప్రియ భవానీ శంకర్ ఈ సినిమాలో కీలక పాత్రలో నటించిన విషయం తెలిసిందే. అయితే ఈ చిత్రం నా వల్లనే ఫ్లాప్ అయ్యిందని.. తన నటనపై సోషల్ మీడియాలో ట్రోల్ అయ్యాయని చెప్పకొచ్చింది. భారతీయుడు సినిమా ఆఫర్ వచ్చినప్పుడు తాను ఆనందంతో ఎగిరి గంతేశానని.. ఆ సినిమా వల్లనే చాలా మూవీల్లో నాకు ఆఫర్లు వచ్చినట్లు చెప్పకొచ్చింది. అయితే సినిమా విడుదల కాకముందే ఫ్లాప్ అని తెలిస్తే.. ఎవరైనా సరే సినిమాలు ఎందుకు చేస్తారు? టెక్నీషియన్ దగ్గర నుంచి ప్రతి ఒక్కరూ సినిమా హిట్టవ్వాలనే కష్టపడతారు. కానీ ఒక్కోసారి రిజల్ట్స్ మన చేతుల్లో ఉండవు. అందరూ ఇష్టంగా కష్టపడి పని చేసినప్పుడు అది వర్కవుట్ కాకపోతే చాలా బాధేస్తుంది. ఒకవేళ భారతీయుడు హిట్ అవ్వదు అని ముందే తెలిసిన నేను అందులో నటించేదాన్ని. కమల్ – శంకర్ సార్ కాంబినేషనల్ వస్తున్న మూవీలో ఛాన్స్ ఎవరు వదులుకుంటారు. అందుకే నేను ఆ సినిమాను చేశాను. కానీ ఈ సినిమా నా వల్లనే ఫ్లాప్ అయ్యిందంటూ నన్ను ట్రోల్ చేయడం మొదలుపెట్టారు. ఇలాంటివి జరిగినప్పుడు చాలా బాధగా ఉంటుంది. మీ అంచనాలను అందుకోలేనందుకు క్షమించండి అంటూ ప్రియా చెప్పకొచ్చింది.


ప్రియ భవానీ శంకర్